## కేసీఆర్‌ను కలిసిన దూదిమెట్ల



కట్టంగూర్, ఫిబ్రవరి13 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పని చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కేసీఆర్ సూచించినట్లు బాలరాజు యాదవ్ తెలిపారు.

# ఎండుతున్న ఎవుసం

- బోర్లు, బావుల్లోనూ అడుగుంటిన నీళ్లు
- పొట్టకొచ్చిన పంటలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్న రైతులు

## సాగునీరు లేక దెబ్బతింటున్న వరి

**వేలకు వేలు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటలు పొట్ట దశలో నీళ్లు లేక కండ్ల ముందు ఎండిపోతుండడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. సాగునీరు రాక, భూగర్భ జలాలు లేక గోస తీస్తున్నారు. బోర్లు, బావుల నమ్ముకుని శక్తి మేరకు ప్రయత్నించినా, ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఎండుతున్న పంటను విధిలేని స్థితిలో పశువుల మేతకు వదిలిపెడుతున్నారు.**

అడ్డగూడూరు/నూతనకల్/తుంగతుర్తి/పెన్‌పహాడ్,, ఫిబ్రవరి 13 : సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. గోదావరి జలాలు రాకపోవడంతో యాసంగిలో సాగు వరి పైర్లు పొట్ట దశలో ఎండిపోతుండడంతో పెట్టుబడి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు మదన పడుతున్నారు. పంటలను కాపాడుకునే పరిస్థితి లేక యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని బొడ్డుగూడెం గ్రామానికి చెందిన వెంపల్ల జన్నపరెడ్డికి చెందిన ఎనిమిదెకరాల వరి పంటను పశువులకు వదిలిపెట్టాడు. తన పొలంలో మూడు బోర్లు ఉన్నా చుక్క నీరు రావడం లేదని జన్నపరెడ్డి ఆవేదన చెందుతున్నాడు. ఎనిమిదెకరాలకు రూ.2లక్షల వరకు పెట్టుబడి అయ్యిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు. ఒక్క బొడ్డుగూడెంలోనే దాదాపు 200 ఎకరాల వరి ఎండిపోయే స్థితిలో ఉండడం బాధాకరం. వెంపల్ల వెంకట్‌రెడ్డి, కేసారపు శ్రీనివాస్‌రెడ్డి, అయిలయ్య, నాగరాజు అనే రైతుల పంటలు ఇప్పటికే ఎండిపోయాయి.

### నూతనకల్ మండలంలో 300 ఎకరాలు

సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో సాబాది భిక్షంరెడ్డి ఎకరం భూమిలో వరి సాగు చేయగా, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు రాకపోవడంతో పంటంతా ఎండిపోయింది. దాంతో పొలంలో బర్రెలను మేపుతున్నాడు. నూతనకల్ మండలంలోని మాచనపల్లి, లింగంపల్లి, నూతనకల్, ఎర్రపహడ్, దిర్శనపల్లి, చిల్పకుంట్ల, మిర్యాల, అల్గునూరు గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల వరి పొట్ట దశలో ఎండిపోవడంతో రైతులు జీవాలు, పశువుల మేతకు వదిలిపెట్టారు. తుంగతుర్తి మండలంలోనూ ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీరు అందకపోవడం, ఎండలు తీవ్రం అవుతుండడంతో బోర్లు, బావుల్లోనూ భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దాంతో పంటలు ఎండిపోతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం జలాల ద్వారా ఇక్కడి రైతాంగం రెండు పంటలు పండించేది. కాంగ్రెస్ సర్కారులో కాళేశ్వరం జలాలు అందకపోవడంతో కరువు తాండవిస్తున్నది.



పెన్‌పహాడ్ మండలం నూర్జహాన్ పేటలో వరి పైరులో మేకలను మేపుతున్న రైతు శ్రీరాములు

### ఐదెకరాల వరి ఎండిపోయింది



నాకున్న ఐదెకరాల్లో వరి నాటు పెట్టాను. కాళేశ్వరం నీళ్లు రాకపోవడంతో సాగు కష్టంగా మారింది. ఎండలు ముదరడంతో బోరు, బావిలోనూ నీళ్లు అడుగంటాయి. చేతికి రావాల్సిన పంట పూర్తిగా ఎండిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం నీళ్లను ఎస్సారెస్పీ కాల్వలకు విడుదల చేయడంతో రెండు పంటలు పండించాను. ఇప్పుడు పరిస్థితి ఘోరంగా ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**- యామ రాజశేఖర్, రైతు, బండరామారం గ్రామం, తుంగతుర్తి మండలం**

### మోకాళ్లపై నిలబడి రైతుల నిరసన

పెన్‌పహాడ్ మండలంలోని నూర్జహాన్ పేట, జల్మలకుంటతండా, చిన్న సీతరాం తండాలో పంటలు ఎండిపోతున్నాయి. చాలా చోట్ల రైతులు పుట్టెడు దుఃఖంతో రెండు వేలు, మూడు వేలకు గొర్లకాపరులకు జీవాల మేత కోసం అప్పగిస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారులో పుట్లకొద్దీ వడ్లు పండించామని, ఎన్నడూ నీళ్లకు ఇబ్బంది లేదని రైతులు చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరి ఆయకట్టు వరకు ఎస్సారెస్పీ నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు నీటి కోసం జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటూ చిన్నసీతరాంతండాకు చెందిన రైతులు గురువారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలపడం గమనార్హం. ఇప్పటికైనా నీళ్లు ఇస్తే ఉన్న కొద్దిపాటి పంటలను కాపాడుకుంటామని ప్రాధేయ పడుతున్నారు.



నూతనకల్ మండలంలో వరి పంటను మేస్తున్న బర్రెలు



తుంగతుర్తి మండలం బండ రామారంలో ఎండిపోయిన వరి



అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెంలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలంలో బర్రెను మేపుతున్న రైతులు



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో చింతపాలెం బీఆర్ఎస్ నాయకులు, చిత్రంలో పార్టీ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చింతలపాలెం, పిబ్రవరి 13 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సూచించారు.

హుజూర్‌నగర్‌లో గురువారం ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన జగదీశ్‌రెడ్డిని చింతలపాలెం మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ఈ నెల 18న మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి, పార్టీని పటిష్ట పర్చుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి ఉన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే సునీతా మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశం

## కాంగ్రెస్ పాలనలో ఎండుతున్న పంటలు

- తాగునీరు కూడా ఇవ్వలేకపోతున్న దుస్థితి
- దోచుకోవడం.. దాచుకోవడమే ఆ పార్టీ నేతల పని
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్లాలి
- కేసీఆర్ పాలనలో ఆలేరుకు కాళేశ్వరం జలాలు
- గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నా పట్టింపేది?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

భువనగిరిక లెక్టరేట్, ఫిబ్రవరి 13 : సాగు నీరు లేక జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని, కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోచుకోవడం.. దాచుకోవడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకున్నదని, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటుపడింది శూన్యమని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశంతో కలిసి గురువారం భువనగిరిలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. ఏ ఒక్క సంక్షేమ పథకమూ అమలుకు నోచడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్, రేవంత్ ప్రభుత్వంపై ప్రజలు పూర్తిగా వ్యతిరేకతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కరెంటు కోతలు ఎక్కువయ్యాయని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఆలేరుకు గోదావరి జలాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరును అందించిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లపై దృష్టి కేంద్రీకరించాలని హితవు పలికారు. ఎంప్లాయిస్, ఎడ్యుకేషన్, పొలిటికల్‌కు వేర్వేరు బిల్లులను పెట్టి చట్టబద్ధత కల్పించాలని, న్యాయస్థానాలకు వెళ్లినా ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణాత్మకంగా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోకపోతే కాంగ్రెస్ బీసీల ద్రోహిగా మిగిలిపోతుందని హెచ్చరించారు. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండడంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. గురుకులాల్లో వసతులు కరువయ్యాయని, కలుషిత ఆహారం, అనారోగ్య సమస్యలతో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే ప్రజలు విసిగి వేశారని, రానున్న కాలంలో బీఆర్ఎస్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీలు సుబ్బూరు బీరు మల్లయ్య, తోటకూరి అనూరాధ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్, ఏవీ కిరణ్‌కుమార్, జాగృతి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్‌రావు, నాయకులు తంగెళ్లపల్లి శ్రీకాంత్, మచ్చ చక్రవర్తి పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల, చిరుమర్తితో కోడి వెంకన్న

## హరీశ్‌రావును కలిసిన మాజీ కౌన్సిలర్ వెంకన్న

చండూరు, ఫిబ్రవరి 13 : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును చండూరు మున్సిపల్ ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి వెళ్లారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ చండూరు 4వ వార్డు అధ్యక్షుడు ఇరిగి రామకృష్ణ ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది

- గురువారం 3 నామినేషన్ల ఉపసంహరణ
- ఈ నెల 27న ఎన్నికలు.. మార్చి 3న కౌంటింగ్
- 12 జిల్లాల్లో 25,797 మంది ఓటర్లు



నల్లగొండ, ఫిబ్రవరి 13 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా చివరికి 19 మంది బరిలో నిలిచారు. ఈ నెల 11న చేపట్టిన స్క్రూటినీలో తండు ఉపేందర్ అనే అభ్యర్థి నామినేషన్ ఫామ్‌పై సంతకం పెట్టకపోవటంతో తిరస్కరించారు. గురువారం కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగిరెడ్డి కోటిరెడ్డి, బండ నాగరాజు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా చివరికి 19 మంది బరిలో ఉన్నట్లు కలెక్టర్, ఆర్‌ఓ ఇలా త్రిపాఠి ప్రకటించారు. ఈ నెల 3న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా స్క్రూటినీ, ఉపసంహరణ అనంతరం 19 మంది బరిలో ఉన్నారు. వారిలో పులి సరోత్తమ్ రెడ్డి(బీజేపీ), లింగిడి వెంకటేశ్వర్లు(ప్రజావాణి పార్టీ), అలుగుబెల్లి నర్సిరెడ్డి, పూల రవీందర్, అర్వ స్వాతి, కంటె సాయన్న, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, ఏలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంగిటి కైలాసం, జెట్టి శంకర్, తలకోల పురుషోత్తంరెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, దామెర బాబురావు, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బంకరాజు, ఎస్ సుందర్‌రాజు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. కొత్తగా ఏర్పడ్డ 12జిల్లాల్లో కలిపి 25,797 మంది ఓటర్లు ఉండగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 984, సూర్యాపేటలో 2,664, నల్లగొండలో 4,683, సిద్దిపేటలో 166 మంది, జనగాం 1002, హనుమకొండ 5,215, వరంగల్ 2,352, మహబూబాబాద్ 1,663, భూపాలపల్లి 329, ములుగు 628, భద్రాద్రి కొత్తగూడెం 2,022, ఖమ్మం 4,089 మంది ఓటర్లు ఉన్నారు. 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఓ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు.



ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు స్కూటీలు అందించాలని ప్రియాంకా గాంధీనికి రాసిన ఉత్తరాలను చూపుతున్న నల్లగొండలోని ఎస్టీ వసతి గృహం డిగ్రీ విద్యార్థినులు

## ప్రియాంకాజీ.. మా స్కూటీలు ఏమైనయ్?

- ఉత్తరాలు రాసిన నల్లగొండ విద్యార్థినులు

నల్లగొండ, ఫిబ్రవరి 13 : ఎన్నికల సమయంలో యువతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన స్కూటీ హామీ అమలు ఏమైందంటూ నల్లగొండ విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పలు విద్యా సంస్థలు, వసతి గృహాల్లో ఉంటున్న డిగ్రీ విద్యార్థినులు గురువారం ప్రియాంకాగాంధీకి ఉత్తరాలు రాశారు. ఎన్నికల సమయంలో 18 ఏండ్లు నిండిన ప్రతి అమ్మాయికీ స్కూటీ ఇస్తామని మీరు చెప్పారు.. కానీ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఇంతవరకూ ఇవ్వలేదని ఉత్తరాల్లో గుర్తుచేశారు. స్కూటీలు ఎప్పుడు ఇస్తారంటూ ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ఇస్తామన్న తులం బంగారం కూడా ఇవ్వడం లేదని పేర్కొంటూ ప్రియాంకగాంధీకి ఉత్తరాలు పోస్ట్ చేశారు.

## కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ ఐజీ ఆఫీస్‌కు అటాచ్!

- కానిస్టేబుల్ ఖలీల్ సస్పెన్షన్
- గుడిపల్లి ఘటనపై విచారణ అధికారిగా దేవరకొండ ఏఎస్పీ నియామకం

నీలగిరి, ఫిబ్రవరి 13 : క్రైమ్ మిర్రర్ డిజిటల్ పత్రిక వ్యవహారంలో కొండమల్లేపల్లి సీఐ ధనంజయ గౌడ్‌ను ఐజీ కార్యాలయానికి ఆటాచ్ చేయడంతో పాటు కట్టంగూర్ పీఎస్ పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఖలీల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. క్రైమ్ మిర్రర్ పత్రిక ముసుగులో కొంతమంది అధికారులు, వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో విచారణ జరిపి వారిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆ పత్రిక విలేకరులకు రహస్యంగా పోలీస్ శాఖ అధికారులు సమాచారం అందిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకున్నారు. కాగా గుడిపల్లి మండల కేంద్రంలోని నారాయణరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని సీఐ ధనుంజయ కొట్టడంతో అతడికి తీవ్ర గాయాలై దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై దేవరకొండ ఏఎస్పీ మౌనికను విచారణ అధికారిగా నియమించి రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు.

## డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు గడువు 28 వరకు పెంపు

రామగిరి, ఫిబ్రవరి 13: మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్షలు రాయడానికి వర్సిటీ అవకాశం కల్పిస్తున్నట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలలో తెలిపారు. వారు ఈ నెల 28లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. 2011-12 నుంచి 2015-16 వరకు ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు బ్యాక్‌లాగ్ పరీక్షలు రాయడానికి ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. సీబీసీఎస్ విధానంలో 2016-17 నుంచి 2019-20 వరకు చదివిన విద్యార్థులు కూడా బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజును 28 లోగా చెల్లించాలని సూచించారు.

## ఎంజీయూ ఐఐసీ డైరెక్టర్‌గా సురేశ్‌రెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 13: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇనిస్ట్యూట్ సెంటర్ (ఐఐసీ) డైరెక్టర్‌గా డాక్టర్ జె.సురేశ్‌రెడ్డిని నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేశ్‌రెడ్డి ఎంజీయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.



హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌కుమార్

## పాలనలో రేవంత్ సర్కారు ఫెయిల్

- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ వర్గమూ సంతోషంగా లేదు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

హాలియా, ఫిబ్రవరి 13 : ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిం టా విఫలమైందని, రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు ఛీకొడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మె ల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నా రు. మళ్లీ ఎన్నికలు వస్తే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీదే అధికారమని తెలిపారు. గురువారం ఆయన నల్లగొండ నుంచి దేవరకొండకు వెళ్తూ హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ నివాసంలో కాసేపు ఆ గారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో తాజా పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో రైతులను మోసం చేశారని, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ప్రారంభమే కాలేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో చెప్పినట్లు పింఛన్ పెంచకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉందని, పారదర్శకత లేకపోవడంతో బీసీ సంఘాల నేతలు ఆగ్రహం ఉన్నారని తెలిపారు. ఏడాది కాలంగా రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ లేదని, స్థానిక సంస్థల ఎన్నికలను కూడా నిర్వహించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు.